ఆంధ్రజ్యోతి

20

యాదాద్రి
భువనగిరి



epaper.andhrajyothy.com

గురువారం ● 31 ఆగస్టు 2017

పల్లెలకు పట్టణ కాంతులు

స్మార్ట్ విలేజ్‌ల అభివృద్ధికి జాతీయ రూర్బన్ మిషన్

జిల్లాలో చౌటుప్పల్ మండలం ఎంపిక

మౌలిక వసతుల కల్పన.. ఉపాధి శిక్షణ

వివరాలు 20 లో...


చౌటుప్పల్ మండలంలోని అంకిరెడ్డిగూడెం గ్రామం

పోరుబాటలో

నార్మాక్స్

- విజయ డెయిరీ లీటర్ పాలకు రూ.4 పెంపు
- నార్మాక్స్‌కు వర్తింపజేయని సర్కార్ 6లో...
- మంత్రి తలసాని, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మను కలిసిన పాలక వర్గం
- నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

బీ ఎస్..నిల్ సేవలు



వేధిస్తున్న నెట్‌వర్క్ టవర్ల సమస్య

తగ్గుతున్న వినియోగదారులు

పలు కార్యాలయాల్లో స్తంభిస్తున్న సేవలు


7

సూపర్ మచ్చీ

- చేప పిల్లల పంపిణీకి సన్నాహాలు
- జిల్లాలో రూ.1.25 కోట్ల వ్యయం..
- 1.96 కోట్ల చేప పిల్లల పంపిణీ
- జిల్లాలో 1093 చెరువులకు.. మొదటి విడతగా 204 ఎంపిక
- ఈ సారైనా నాణ్యమైన చేపల సీడ్ వచ్చేనా...?

మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చెరువుల్లో చేప పిల్లలను వదిలే పథకం అమలు చేయడానికి అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. రెండు మూడు రోజుల్లో శ్రీకారం చుట్టనున్న ఈ కార్యక్ర మానికి జిల్లాలో వర్షాభావ పరిస్థి తులు ఆటంకంగా మారాయి. జిల్లాలో 1093 చెరువులు ఉండగా.. కేవలం 204 చెరు వులు మాత్రమే చేప పిల్లలను వద లడానికి అనుకూలంగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వీటిలో రూ.1.25 కోట్ల వ్యయంతో 1కోటి 96 లక్షల చేపపిల్లలను వదలనున్నారు.

● ఆంధ్రజ్యోతి, యాదాద్రి



8

వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యశ్రీ

ఆత్మకూరు(ఎం): మండలంలో వ్యక్తిగత మరుగుదొడ్లు లేని ప్రతి కుటుంబం తక్షణమే నిర్మించుకోవాలని ఎంపీపీ కె.భాగ్యశ్రీ కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రజాప్రతినిధులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునే కుటుంబానికి స్వచ్ఛ భారత్ నిధుల నుంచి రూ.12 వేలు చెల్లించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో జి.అంబబాయి, ఈవోపీఆర్డీ రాములునాయక్, ఏపీవో బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర విజయవంతం చేయాలి

యాదాద్రి రూరల్: మదర్ డైరీ ఉత్పత్తిదారులకు ధర పెంచాలని కోరుతూ ఈ నెల 31న పాల ఉత్పత్తిదారులు చేపట్టిన చలో కలక్టరేట్ పాదయాత్రను విజయవంతం చేయాలని సైదాపురం, బాహుపేట, మసాయిపేట పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్లు బీర్ల అయిలయ్య, సుడుగు బాల్‌రెడ్డి, కనకయ్య, భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం వారు గుట్టలో వారు విలేకరులతో మాట్లాడుతూ కేవలం విజయ పాల డైరీ ఉత్పత్తిదారులకు మాత్రమే లీటరుకు రూ.4 సబ్సిడీ ఇవ్వడం, మదర్ డైరీ ఉత్పత్తిదారులకు ఇవ్వక పోవడంతో వారు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉత్పత్తిదారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మున్నూరు కాపులు ఐక్యంగా ఉండాలి

ఆలేరు: తమ సమస్యల పరిష్కారానికి మున్నూరు కాపులందరూ ఐక్యంగా ఉద్యమించాలని వేములవాడ మున్నూరుకాపు నిత్య అన్నదాన చారిట్రబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొండా దేవయ్య అన్నారు. బుధవారం వరంగల్ జిల్లా నుంచి హైద్రాబాద్‌కు కాన్వాయిలో బయలు దేరిన ఆయన మార్గమధ్యలోని ఆలేరులో జరిగిన మున్నూరు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణలోని 31 జిల్లాల్లో తెలంగాణ మున్నూరుకాపు అసోసియేషన్ యాక్షన్ కమిటీలు చేపట్టామని ఆయన ఈసందర్భంగా తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో రైతాంగం మహిళా కమిటీలు వేసుకోవాలని సూచించారు. వచ్చే డిసెంబర్‌లో హైద్రాబాద్‌లో 20లక్షల మందితో నిర్వహిస్తున్న బహిరంగ సభకు మున్నూరు కాపులు తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు తోట మల్లయ్య, పట్టణ అధ్యక్షుడు ఎలుగల బాలయ్య, శ్రీనివాస్, నాయకులు భుజలింగం, ఎలుగల స్వామి, కందుల యాదగిరి, తోట బాలరాజు, నారాయణ ,లక్ష్మీనారాయణ, భాస్కర్, కుమార స్వామి, పాపయ్య, మహేందర్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పల్లె జీవనం పునరుద్ధరణకు సీఎం కేసీఆర్ కృషి

● తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

మోత్కూరు: ఉమ్మడి రాష్ట్రంలో, గత ప్రభుత్వాల పాలనలో ధ్వంసమైన పల్లె జీవనాన్ని పునర్జీవింపజేసేందుకు సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి కృషి చేస్తున్నారని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని దత్తప్పగూడెం గ్రామంలో గొల్ల కురుమలకు గొర్రెల యూనిట్లు పంపిణీ చేసి, ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అన్ని కుల వృత్తుల వారిని ఆదుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ట్యాగ్‌లైన్ అయిన నీరు, నిధులు, నియామకాలు, సీఎం కేసీఆర్ సమర్థవంతంగా అమలు చేస్తున్నారన్నారు. పాడితో ప్రగతి పథకంతో సమభావన సంఘాల మహిళలకు శ్రీనిధి నుంచి పాడి గేదె కొనుగోలుకు రూ.50 వేలు రుణంగా ఇస్తున్నారన్నారు. మండలానికి 300 యూనిట్లు మంజూరయ్యాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో 80 లక్షల మంది మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

గొర్రెలు అమ్మితే క్రిమినల్ కేసులు: కలెక్టర్

గొల్ల కురుమలకు ప్రభుత్వం 75శాతం సబ్సిడీపై ఇస్తున్న గొర్రెలను అమ్మితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని కలెక్టర్ అనితారామచంద్రన్ హెచ్చరించారు. జిల్లాలో ప్రస్తుతం 7 లక్షల గొర్రెలు ఉన్నాయని, ప్రభుత్వ సబ్సిడీ పథకం ద్వారా మరో ఆరున్నర లక్షల గొర్రెలు జిల్లాకు రానున్నాయన్నారు. కొందరు గొల్ల కురుమలు ఇక్కడి గొర్రెలే కొనుక్కోవడానికి అవకాశమివ్వాలనడం సరైనది కాదన్నారు. సర్పంచ్ ముక్కెర్ల నర్సయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఆర్‌డీవో వెంకట్రావ్, టీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మార్కెట్ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, ఎంపీపీ ఓర్సు లక్ష్మీ, జడ్పీటీసీ చింతల వరలక్ష్మీ, మోత్కూరు, అడ్డగూడూరు తహసీల్దార్లు జి.దరశథ, కె.జ్యోతి, ఎంపీడీవో కె.వెంకటనర్సయ్య, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నిమ్మల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ జంగ శ్రీనివాస్, వెటర్నరీ ఏడీ ప్రకాష్‌రావు, డాక్టర్ అశోక్, కల్వల ప్రకాష్‌రాయుడు, మల్లికార్జున యాదవ సంఘం అధ్యక్షుడు ఎలుగు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

కార్యకర్తలకు అండగా టీఆర్ఎస్

యాదాద్రి రూరల్: టీఆర్ఎస్‌లో చేరిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే గొంగిడి సునితామహేందర్‌రెడ్డి, టీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. మూటకొండూర్ మండల కేంద్రానికి చెందిన ఆయా పార్టీల కార్యకర్తలు బుధవారం గుట్టలో మండల అధ్యక్షుడు దూదిపాల రవిందర్‌రెడ్డి, గ్రామశాఖ మహిళా అధ్యక్షురాలు బొలగాని నాగమణిమోహన్ గౌడ్ ఆధ్వర్యంలో సుమారు 120 మంది టీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి గులాబి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో చేరిన వారందరికీ పార్టీ అండగా ఉంటుందన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. చేరిన వారిలో ఎత్తరి వెంకటేశం, శివప్రసాద్, గండికోట దుర్గయ్య, లక్ష్మీ, భారతమ్మ, ఉమ మరి కొందరు ఉన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి ఆరె యాదగిరిగౌడ్, గుట్ట టీఆర్ఎస్ మండల,పట్టణ పార్టీ అధ్యక్షులు కర్రె వెంకటయ్య, కాటబత్తిని ఆంజనేయులు, నాయకులు గడ్డమీది రవిందర్‌గౌడ్, వెంకటయ్యగౌడ్, నువ్వుల రమేశ్, కె నర్సింహారెడ్డి, పాండు, శ్రీశైలం ఉన్నారు.



పార్టీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే సునీత మహేందర్‌రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి

రెడ్‌క్రాస్ జిల్లా కార్యవర్గం ఎన్నికలు నేడు

మోత్కూరు: యాదాద్రిభువనగిరి జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ నూతన కార్యవర్గానికి గురువారం ఎన్నికలు జరగనున్నాయి. జిల్లా రెడ్‌క్రాస్ సంస్థలో 435 మంది సభ్యులు ఉన్నారు. జిల్లాకు 15 మంది డైరెక్టర్ స్థానాలు ఉండగా 18 మంది పోటీ పడుతుండటంతో గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎన్నిక నిర్వహించనున్నారు. 15 మంది డైరెక్టర్లను ఎన్నుకున్న తర్వాత వారిలోంచి చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారిని ఎన్నుకుంటారు.

విమోచన దినాన్ని ప్రభుత్వమే నిర్వహించాలి

ఆత్మకూరు(ఎం): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని కోరుతూ మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు బొట్టు అబ్బయ్య బొబ్బల ఇంద్రారెడ్డి, మండల అధ్యక్ష,కార్యదర్శులు బి.సత్యనారాయణ, కె.మత్స్యాచారి, ఎం.ఉపేందర్, డి.స్వామి, టి.రాంబాబు, వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల ర్యాలీ నేడు

ఆత్మకూరు(ఎం): మదర్‌డెయిరీ పాల ఉత్పత్తిదారులకు కూడా వర్తింప చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31న భువనగిరి పట్టణ కేంద్రం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్టు మదర్‌డెయిరీ పాల ఉత్పత్తిదారుల మండల ఫోరం అధ్యక్షుడు జెన్నాయకోడె నాగేష్ తెలిపారు.

సామూహిక సెలవు విజయవంతం చేయాలి

ఆత్మకూరు(ఎం): కంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న నిర్వహించే సామూహిక సెలవు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈఏ మండల అధ్యక్షుడు ఎం.అశోక్ కోరారు.

సేవాభావం పెంపొందించాలి

ఆత్మకూరు(ఎం): విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే సేవా భావాన్ని పెంపొందించాలని ఎస్ఐ డి.అనిల్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని సరస్వతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు, యాజమాన్యం కలిసి రూ.10వేల విరాళాన్ని చౌటుప్పల్‌లోని అమ్మానాన్న ఆశ్రమానికి అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మహిమాన్వితం మల్లిఖార్జునస్వామి ఆలయం



భువనగిరి రూరల్: మండలంలోని బొల్లెపల్లి గ్రామంలోని శ్రీమల్లిఖార్జునస్వామి ఆలయం(మల్లన్న గుడి)లో పూజలు చేస్తే కోర్కెలు వెంటనే తీరుతాయని భక్తుల నమ్మకం. సుమారు 50 సంవత్సరాల క్రితం మూసీ వాగు ప్రక్కన భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి విగ్రహాలు బయటపడడంతో చిన్న గుడి నిర్మాణం చేపట్టి ఆ విగ్రహాలను ప్రతిష్టించారు. కాగా ఆనతి కాలంలోనే ఎంతో ప్రాచుర్యం పొందింది. కోరిన కోర్కెలు తీర్చే భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతుంది. ప్రతియేటా ఎప్రిల్ చివరి వారంలో, మే మొదటి వారంలో గ్రామస్థులు వారం రోజుల పాటు బ్రహోత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఆలయం మహిమన్వితమైంది..



శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత వుంది. మొక్కు లు చెల్లించిన భక్తులకు కోరిన కోర్కెలు తీరుతాయి. స్వామి ఉత్సవాలు వారం రోజులపాటు ఘనంగా జరుగుతాయి.

- ఎన్ మణికంఠశర్మ, పూజారి, బొల్లెపల్లి.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



భువనగిరి రూరల్: కంట్రీబ్యూషన్ పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. 2004 సెప్టెంబర్ 1 తర్వాత నియమించిన ప్రతి ప్రభుత్వ ఉద్యోగి రిటైర్డ్‌మెంట్ అయిన తర్వాత ఉద్యోగికి, ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక సంబంధం లేకుండా చేసే ఈ దుర్మార్గమైన చట్టాన్ని ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. బుధవారం భువనగిరి జిల్లా కేంద్రంలో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సెప్టెంబర్ 1వ తేదీని బ్లాక్ డేగా పరిగణిస్తు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించేందుకు పలు ఉపాధ్యాయ సంఘాలు సిద్ధమవుతున్నాయి.

సీపీఎస్ విధానం వల్ల నష్టం..



సీపీఎస్ విధానంతో రిటైర్డ్‌మెంట్ ఆనంతరం నెలనెలా పెన్షన్ రాదు. ప్రభుత్వ గ్రాట్యూవిటీ ప్రయోజనం లభించదు. 35 సంవత్సరాలు సర్వీస్ చేసిన ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడవల్సిన దుస్థితి ఉంది. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు ఐక్యంగా ఉద్యమించాలి.

హరికిషన్‌రావు, వీఆర్వోల సంఘం రాష్ట్ర కార్యదర్శి.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

అడ్డగూడూరు: టీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో శ్రీనిధి ద్వారా పాడి ప్రగతి కార్యక్రమంలో మహిళలకు గేదెలు పంపిణీ చేసి మాట్లాడారు. మహిళలకు పాడి గేదెలు, ఆవులు ఎన్నైనా ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ పథకానికి తుంగతుర్తి నియోజకవర్గంలో మోత్కూరు, అడ్డగూడూరు మండలాల నుంచే శ్రీకారం చేపట్టామన్నారు. పాడి సపోర్టు ఉంటే ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. వెలుగు కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లయితే వెంటనే రూ.50 వేల రుణం అందజేస్తామన్నారు. పశువులను పోషించే వారితో పాటే ఉంటాయన్నారు. పాడి గేదెలు, ఆవులు ప్రమాదం జరిగి మృతి చెందితే దానికి సంబంధించిన రుణం ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. పాడి పశువులకు స్థలం లేనివారు పెరటికోళ్ల పెంపకం చేపట్టవచ్చన్నారు. మహిళల కోసం కల్యాణలక్ష్మీ, కేసీఆర్ కిట్, ఒంటరి మహిళలకు పింఛన్లు లాంటి పథకాలు అమలవుతున్నాయన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను అమలు చేస్తున్నామన్నారు. వచ్చే బతుకమ్మ పండుగకు రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి చీరెలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీ వెంకట్రావ్, రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మార్కెట్ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, జడ్పీటీసీ చింతల వరలక్ష్మీ, తహసీల్దార్ జ్యోతి, ఎంపీటీసీ పూలపల్లి జనార్ధన్‌రెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


మహిళకు మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

బాబురావు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే


బాబురావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

అడ్డగూడూరు: మండల కేంద్రంలో టీఆర్ఎస్ నాయకుడు బాలెంల బాబురావు తల్లి మరియమ్మ ఇటీవల మృతి చెందగా బుధవారం స్థానిక ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నాల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ పూలపల్లి జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం


క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ మహేంద్రనాథ్

అడ్డగూడూరు: క్రీడలతోనే శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం వస్తుందని మార్కెట్ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, ఎంపీపీ ఓర్సు లక్ష్మీ అన్నారు. బుధవారం మండలంలోని ఉన్నత పాఠశాలలో అండర్-17, 14 విభాగాల్లో క్రీడాకారులకు పోటీలను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. సింగిల్‌విండో చైర్మన్ చిత్తలూరి హన్మంతరావు, మార్కెట్ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్ విద్యార్థులకు క్రీడాదుస్తులు అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి, ఎంపీ డీవో కె.వెంకటనర్సయ్య, ఎంఈవో మన్నె అంజయ్య, ఎంపీటీసీ పూలపల్లి జనార్ధన్‌రెడ్డి, హెచ్‌ఎం. అనంతరెడ్డి, పీఈటీలు యాదయ్య, బాలాజీ పాల్గొన్నారు.

బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేయాలని ధర్నా


జ్యోతిరావుపూలే చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

మోత్కూరు: మోత్కూరు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేయాలని పలువురు విద్యార్థులు కోరారు. బుధవారం యాదాద్రి ఆర్టీసీ ఎదుట బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, దళిత విద్యార్థి సంఘం నాయకుడు దాసరి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పలు మండలాల నుంచి మోత్కూరుకు రోజూ సుమారు 1500 మంది విద్యార్థులు వస్తుంటారన్నారు. వారికి కొత్త బస్‌పాస్‌లు ఇవ్వడం, రెన్యూవల్ చేయడం కోసం మోత్కూరు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ కౌంటర్ లేకపోవడంతో విద్యార్థులు యాదగిరిగుట్ట, నార్కట్‌పల్లి, జనగాం వెళ్లితెచ్చుకోవాల్సి వస్తుందన్నారు. వెంటనే బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కారుపోతుల వెంకన్న, డి.సోమలింగాచారి, ఎండి. సమీర్, కె.దినేష్, వినయ్, సాగర్, సంధ్య, సరస్వతి, అఖిల, అనిత, సునీత తదితరులు పాల్గొన్నారు.

చెప్పుల దుకాణంలో చోరీ

తుర్కపల్లి: మండల కేంద్రంలో బుధవారం తెల్లవారు జామున దుండగులు రెండు దుకాణాలు, ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. మండల కేంద్రంలోని జహాంగీర్ అనే వ్యక్తికి చెందిన చెప్పు దుకాణం తాళాన్ని పగలగొట్టి దుకాణంలోకి ప్రవేశించి సుమారు రూ.5వేల రూపాయల విలువ చేసే చెప్పులను ఎత్తుకెళ్ళారు. ఆ సమీపంలోనే కొన్ని రోజులుగా తాళం వేసి ఉన్న ఎలుగల అంజయ్య ఇంటి తాళాన్ని పగులగొట్టి ఇంట్లోని ప్రవేశించి చిందరవందరగా పడేశారు. జివిలికపల్లి అంజనేయులుకు చెందిన ప్రణతీ లేడీస్ ట్రైలర్ షాపు షటర్ తెరుస్తుండగా వచ్చిన శబ్దానికి ఆంజనేయాలు లేచాడు. అంజనేయులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు రావడాన్ని గుర్తించిన దుండగులు పరారయ్యారు. దొంగలను పట్టుకునేందుకు ఎస్ఐ వెంకటయ్య, తన సిబ్బందిని అలర్ట్ చేసినా ఫలితం దక్కలేదు.

డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

మోత్కూరు: మోత్కూరు, అడ్డగూడూరు మండలాల రైతులు 2017-18 ఆర్థిక సంవత్సరానికి గాను డ్రిప్, స్ప్రింకర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఉద్యాన విస్తరణాధికారి అరూరి నర్సింహ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అడ్డగూడూరు మండలానికి 50 డ్రిప్, 30 యూనిట్లు స్ప్రింకర్లు, మోత్కూరు మండలానికి 70 డ్రిప్, 50 యూనిట్లు స్ప్రింకర్లు మంజూరయ్యాయన్నారు. నూతనంగా పండ్ల తోటలు సాగు చేసే వారికి ఉద్యానశాఖ నుంచి 40శాతం సబ్సిడీతో నిర్వహణ ఖర్చు ఇస్తారని, వీటి కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 8374449439లో సంప్రదించాలన్నారు.

సెప్టెంబర్ 1ను విద్రోహ దినంగా పాటించాలి

మోత్కూరు: సెప్టెంబర్ 1ని పింఛన్ విద్రోహ దినంగా పాటిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయులంతా ఆ రోజున సామూహిక సెలవు పెట్టి మండల, జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని టీఆర్ఎస్‌టీయూ మండల అధ్యక్షుడు ధర్మారపు వెంకటయ్య, ప్రధానకార్యదర్శి వీరవెల్లి ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించేంత వరకు ప్రభుత్వంపై పోరాడాల్సిందేనన్నారు. సెప్టెంబర్ 1న ఉద్యోగ, ఉపాధ్యాయులు సామూహిక సెలవు పెట్టి ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అడ్డగూడూరు: టీఎస్‌సీపీఎస్‌ఈఏ మండల కమిటీ ఆధ్వర్యంలో సీపీఎస్ విధానం రద్దు చేయాలని పలువురు ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సెప్టెంబర్ 1న తలపెట్టిన సామూహిక సెలవు కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు సామూహిక సెలవు పత్రాన్ని తహసీల్దార్ జ్యోతికి అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల కమిటీ సభ్యులు బి.సైదులు, ఆర్. శివాజీ, ఎం.వంశీకృష్ణ, ఎం.సత్యనారాయణ, డి.వెంకటేష్, ఇ.సత్యనారాయణ, వి.నర్సిరెడ్డి, రాములు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు సెలవుపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ప్రతి ఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలి


అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

మోత్కూరు: ప్రతి ఒక్కరూ భక్తి భావం అలవర్చుకోవాలని బుర్ర వెంకన్న అన్నారు. మండల కేంద్రంలో చెరువు కట్ట వద్ద ఏర్పాటు చేసిన గణేషుని మండపం వద్ద బుధవారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దాత బుర్ర వెంకన్న, కట్ట యాకు, దొంతోజు సోమలింగాచారి, అన్నందాస్ మత్స్యగిరి, బి.శ్రీకాంత్, బన్ని, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఈత, ఖర్జూర మొక్కలు పెంచాలి

మోత్కూరు: కల్లు గీత కార్మికులు హరితహారంలో ఈత, ఖర్జూర మొక్కలను నాటి పెంచాలని మోత్కూరు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలో ఎక్సైజ్ కార్యాలయం పరిధిలోని కల్లు గీత కార్మికులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. హరితహారం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఈత, ఖర్జూర చెట్లను పెంచాలని సూచించారు. చెట్లు పెంచినట్టయితే గీత కార్మికులకు ఉపాధి లభిస్తుందన్నారు. హరితహారంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎస్ఐ ఫజలోద్దీన్ ఆయన వెంట ఉన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

రాజాపేట : మండలంలోని పుట్టగూడెం మదిర గ్రామమైన కొండెడిచెరువులో రూ.9లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ లావణ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు.

గ్రామంలోకి బస్సులు నడపాలని రాస్తారోకో


జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

యాదాద్రి రూరల్ : ఆర్టీసీ బస్సులు గ్రామంలోకి నడపాలని డిమాండ్ చేస్తూ మండలంలోని చిన్నకందుకూర్ స్టేజీ వద్ద గ్రామ విద్యార్థులు బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ యాజమాన్యం గ్రామానికి బస్సులు నడుపుతామని హామీలిచ్చి కేవలం స్టేజీ వరకే నడపడంతో సుమారు 2కి.మీ నడవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు.

పిల్లలందరికీ ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలి

యాదాద్రి టౌన్ : మీజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్‌ను 15ఏళ్ల లోపు పిల్లలందరికీ వేయించాలని దేవస్థాన సంస్కృత విద్యాపీఠం ప్రిన్సిపాల్ ధరూరి రామానుజాచార్యులు కోరారు. స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది సంస్కృత విద్యాపీఠం విద్యార్థులకు బుధవారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాంతక వ్యాధులపై ప్రభుత్వం ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుందన్నారు.

పాల ధర పెంచాలి

రాజాపేట : పాల ధరను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పాల సంఘాల చైర్మన్లు గొల్లపల్లి రాంరెడ్డి, పెంటపర్తి రాజిరెడ్డి, ఎడ్ల రాంచంద్రారెడ్డి, అంజిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులు పూర్తిగా పాడిపైనే ఆధారపడి జీవిస్తున్నారని పాల దిగుబడి కోసం అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకు ధర పెంచకపోవడంతో పాడి రైతులు నష్టాల పాలవుతున్నారన్నారు. విజయ డెయిరీకి ఇచ్చినట్లుగానే మదర్ డెయిరీలో పాలు పోసే రైతులకు లీటరుకు 4రూపాయలు అదనంగా చెల్లించాలన్నారు.

ఆత్మకూరు(ఎం) : విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారులకు ప్రభుత్వం అందిస్తున్న రూ.4 ఇన్‌సెంటివ్‌ను మదర్‌డెయిరీ పాల ఉత్పత్తిదారులకు సైతం వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ గురువారం పట్టణ కేంద్రం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు మదర్‌డెయిరీ పాల ఉత్పత్తిదారుల మండల ఫోరం అధ్యక్షుడు నగేష్ తెలిపారు.

మహిళల అభివృద్ధే కేసీఆర్ లక్ష్యం

● ప్రభుత్వ విప్ గొంగిడి సునీత


కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్న ప్రభుత్వ విప్ సునీత

యాదాద్రి రూరల్ : మహిళలను ఉన్నత శిఖరాలకు చేర్చడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ స్థాయిలో కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకం ద్వారా మంజూరైన చెక్కులను పట్టణంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పేదల వివాహ సమయంలో కొంతవరకు ఆర్థిక సహకారం అందించాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టి పేదలకు తోడ్పాటు అందించారన్నారు. కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కాలె సుమలత, టీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి, ఎంపీపీ గడ్డమీది స్వప్న, జడ్పీటీసీ కర్రె కమలమ్మ, సర్పంచ్ బూడిద స్వామి తదితరులు పాల్గొన్నారు.

పాడి ఉత్పత్తిలో ఆలేరు ముందంజ

పాడి ఉత్పత్తిలో జిల్లాలోనే యాదగిరిగుట్ట మండలం ముందంజలో ఉందని ఎమ్మెల్యే సునీత అన్నారు. మండలంలోని కాచారం మదిర గ్రామమైన ధర్మారెడ్డిగూడెంలో బుధవారం ఆమె పశు ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆల్డా చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి, ఎంపీపీ గడ్డమీది స్వప్న, జడ్పీటీసీ కర్రె కమలమ్మ, సర్పంచ్ స్వర్గం పరమేశ్వరి, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

వందశాతం మరుగుదొడ్లు నిర్మించుకోవాలి : ఎంపీపీ


మాట్లాడుతున్న ఎంపీపీ తిరుపతిరెడ్డి

బొమ్మలరామారం : ప్రతీ గ్రామంలో నూటికి నూరు శాతం మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఎంపీపీ బొల్లంపల్లి తిరుపతిరెడ్డి సూచించారు. మరుగుదొడ్ల నిర్మాణం, హరితహారం కార్యక్రమాలపై మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్వచ్ఛభారత్, హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం మరుగుదొడ్ల ఆవశ్యకత, హరితహార కార్యక్రమాలపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మర్రి జయమ్మ, ఎంపీడీవో కృష్ణారెడ్డి, వైస్‌ఎంపీపీ కుకుట్ల శ్రీశైలం, ఈవోపీఆర్డీ గీతారెడ్డి, ఈజీఎస్ ఏపీఎం కళావతి, వెలుగు ఏపీఎం రమణతో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ గ్రామాల కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అఖిలపక్షం ఆధ్వర్యంలో 7న..


సమావేశంలో మాట్లాడుతున్న బండ్రు శోభారాణి

ఆలేరు : జాతీయ రహదారి బైపాసుల వద్ద ప్రమాదాల నివారణకు అండర్‌పాస్ బ్రిడ్జిలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 7న ఆలేరులోని జీడికల్ రోడ్డుపై రాస్తారోకో చేపట్టాలని అఖిలపక్షం సమావేశం తీర్మానించింది. తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు బండ్రు శోభారాణి అధ్యక్షతన బుధవారం ఆలేరులో అఖిలపక్ష పార్టీలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి


అధికారికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆత్మకూరు(ఎం) : సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని కోరుతూ బీజేపీ నాయకులు బుధవారం తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు బొట్టు అబ్బయ్య మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణ ప్రభుత్వం కూడా విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

'తెలంగాణలో అధికారమే లక్ష్యం'


బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న శ్రీధర్‌రెడ్డి

తుర్కపల్లి : 2019లో జరిగే ఎన్నికల్లో తెలంగాణలో అధికారం చేపట్టడమే లక్ష్యంగా గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొంతిరి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని గంధమల్ల గ్రామంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత పార్టీలో చేరేందుకు ఉత్సాహాన్ని చూపుతోందన్నా రు. పార్టీ పటిష్టతకు నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. హామీల అమలులో టీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. గంధమల్ల రిజర్వాయర్ పనులను భూనిర్వాసితుల అభిప్రాయం మేరకే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతకు ముందు గ్రామంలో బీజేపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాట పెంటయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బానోతు చత్రునాయక్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్ పార్టీ ప్రతీ ఒక్కరికి అండ..


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తిరుపతిరెడ్డి

బొమ్మలరామారం : అన్ని కుల, మతాలకు టీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎంపీపీ బొల్లంపల్లి తిరుపతిరెడ్డి, టీఆర్ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు మూగల స్వయంప్రభ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేసీఆర్ పథకాలతో ప్రతీ కుటుంబం ఆర్థికంగా ఎదుగుతోందన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు : ఎంపీపీ

ఆత్మకూరు(ఎం) : క్రీడలు శరీరక దారుడ్యంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎంపీపీ భాగ్యశ్రీ అన్నారు. పాఠశాలల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు పాఠశాల దశ నుంచే వివిధ క్రీడల్లో నైపుణ్యం సాధించాలని కోరారు. అనంతరం అండర్-17, 14 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ క్రీడల్లో పోటీలు నిర్వహించి మండలస్థాయి క్రీడాకారులను ఎంపిక చేసి జిల్లాస్థాయి పోటీలకు పంపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జి.మల్లేశం, ఎంపీడీవో జి.అంబాబాయి, ఎంఈవో వనం రాజారాములు, ఎంపీటీసీ డి.నర్సింహాచారి, సర్పంచ్ బి.చందర్, ఎస్ఎంసీ చైర్మన్ నాతి వెంకటేశ్వర్లు, హెచ్ఎం భాస్కర్, ఎస్‌వైఎం అధ్యక్ష, కార్యదర్శులు పి.మల్లేశం, డి.భాస్కర్, పీఈటీ బి.రామస్వామి పాల్గొన్నారు.

తుర్కపల్లి : విద్యార్థులు క్రీడల్లో రాణించి తమ ప్రతిభను చాటుకోవాలని ఎంఈవో కృష్ణ కోరారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్‌ను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శేషగిరిరావు, పీడీ మురళి, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్యాస్ సమాచారం

తుర్కపల్లి

తుర్కపల్లి వైష్ణవి ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్‌లో గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులకు వెంటనే గ్యాస్ సరఫరా చేస్తారు. కొత్తగా గ్యాస్‌కనెక్షన్లకు సెల్ నంబర్లు: 9912305419, 9550195232

కూరగాయల ధరలు

కిలో ధర

దోసకాయ16, సొరకాయ10, టమాట40, చిక్కుడు36, క్యాప్సికం48, మిర్చి(సన్న)28, మిర్చి(దొడ్డ)40, క్యారెట్40, క్యాబేజీ28, బెండ30, దొండ32, చామగడ్డ32, బీర28, కాకర36, ఆలుగడ్డ20, వంకాయ30, బీట్‌రూట్30, గోకర28, బీన్స్30, ఉల్లిగడ్డలు తెల్లవి-26, ఎర్రవి-28.

(ఆలేరు)

సినిమాలు

యాదగిరిగుట్ట

లక్ష్మి - నక్షత్రం

ajbngpc@gmail.com

నేటి జాబ్ మేళా వాయిదా

యాదాద్రి, ఆంధ్రజ్యోతి : పట్టణంలో గురువారం నిర్వహించాల్సిన జాబ్‌మేళా వాయిదా వేసినట్లు డీఆర్‌డీవో ఎస్.వెంకట్రావ్ తెలిపారు. మెరుగైన ఉద్యోగాలు కల్పించే పెద్ద పెద్ద కంపెనీలకు భాగస్వాములను చేయడానికి వాయిదా వేసినట్టుగా పేర్కొన్నారు.

గణనాథుల వద్ద ప్రముఖుల పూజలు


పూజలు చేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ సుర్వి లావణ్య

భువనగిరి రూరల్ : పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొల్పిన గణేష్ మండపాల వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమాలు చేపట్టి ప్రత్యేక పూజలు చేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్‌పర్సన్ సుర్వి లావణ్య, గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ అమరేందర్‌గౌడ్, తహసీల్దార్ కె.వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోత్నక్ ప్రమోద్‌కుమార్, పీసీసీ మాజీ కార్యదర్శి తంగెళ్లపల్లి రవికుమార్, గొర్రెంకల శివశంకర్, ఎస్సీ సెల్ చైర్మన్ ఎడమ బాలకృష్ణ, పచ్చలకట్ట సోమేశ్వర ఆలయ చైర్మన్ ఇరుకుల రామకృష్ణ, ఉత్సవ సమితి అధ్యక్షుడు దేవరకొండ నర్సింహాచారి, కౌన్సిలర్లు పడమటి జగన్మోహన్‌రెడ్డి, వెల్దుర్తి రఘునాథ్, ఏవీ.కిరణ్, పిట్టల సునీత, మాయ దశరథ, రావుల రాజు, సర్పంచ్ గోద శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

భువనగిరి టౌన్ : గణేష్ నిమజ్జన ఏర్పాట్లను మునిసిపల్ చైర్‌పర్సన్ సుర్వి లావణ్య, కమిషనర్ జి వేణుగోపాల్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. పట్టణంలో సుమారు 200 గణనాథులను వచ్చే నెల 3న నిమజ్జనం చేయనున్నారు. ఈ నేపథ్యంలో గణేష్ నిమజ్జనం స్థానిక పెద్ద చెరువులో చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. బారికేడింగ్, లైటిం గ్, రోడ్ల నిర్మాణం, తాగునీరు, పారిశుధ్యం, క్రేన్లు తదితర ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు డీఎన్.చారి, కౌన్సిలర్ జగన్మోహన్‌రెడ్డి, మునిసిపల్ అధికారులు పీవీఆర్ నర్సింహారెడ్డి, రాజీవ్‌రెడ్డి, దోసపాటి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి : బీజేపీ


సమావేశంలో మాట్లాడుతున్న వేముల అశోక్

భువనగిరి రూరల్ : సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వేముల అశోక్ డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ విమోచన యాత్రలో భాగంగా సెప్టెంబర్ 2న భువనగిరికి వస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్‌కు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ అనుబంధ సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రావుల సత్తయ్య, నాయకులు కోళ్ల భిక్షపతి, కురారం పరమేష్, కె.రవి, సాగర్, ఆంజనేయులు ఉన్నారు. అదేవిధంగా బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో యువమోర్చా జిల్లా అధ్యక్షుడు సురకంటి రంగారెడ్డి, పట్నం కపిల్, శివాజీ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఆవిష్కరించాలని నిరసన


విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

భువనగిరి రూరల్ : పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఆవిష్కరించాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రావుల రాజు కోరారు. ముసుగుతో కప్పి ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పూలే విగ్రహం ఆవిష్కరణకు నోచుకోకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకురాళ్లు రత్నపురం పద్మ, రేష్మ, చంద్రమ్మ, నాగమణి, బాలరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనం నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి


వినతిపత్రం అందిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

మోటకొండూర్ : మండల కేంద్రంలో పద్మశాలి చేనేత కార్మికులకు కమ్యూనిటీహాల్ ఏర్పాటు చేయాలని మార్కండేయ సంఘం నాయకులు బుధవారం ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ఆమె సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వినతిప్రతం అందించిన వారిలో అధ్యక్షుడు దేవసాని ఎల్లప్ప, బొజ్జ శంకర్, బోగ రమేష్, అశోక్, నర్సింహ, స్వామి, రామస్వామి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న తిరుమల్‌రెడ్డి

మోటకొండూర్ : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సామాన్య ప్రజలందరూ ఉపయోగించుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రం జిల్లా కేంద్రంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణలో భవిష్యత్ బీజేపీదే


శ్యాంసుందర్‌రావు ఆధ్వర్యంలో బీజేపీలో చేరిన యువకులు

బీబీనగర్ : రాష్ట్రంలో భవిష్యత్ బీజేపీదేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శ్యాంసుందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 50మంది యువకులు ఆయన సమక్షంలో బుధవారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశమంతా నరేంద్రమోదీ పాలనలోని బీజేపీ ప్రభుత్వాన్ని కోరుకుంటుందన్నారు. దీనికి అవినీతి రహిత పాలనే కారణమన్నారు.

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం


గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

భువనగిరి టౌన్ : పట్టణ ప్రధాన రహదారి వెంట గల అరుణ జనరల్ స్టోర్స్‌లో అక్రమంగా విక్రయిస్తున్న సుమారు రూ. 10వేల విలువైన గుట్కా ప్యాకెట్లను పట్టణ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నారని అందిన సమాచారం మేరకు పట్టణ ఎస్ఐ విజయకృష్ణ ఆధ్వర్యంలో తనిఖీలు చేయగా గుట్కా ప్యాకెట్లు లభ్యమయ్యాయి. దీంతో స్టోర్స్ యజమానిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ దివ్యచరణ్‌రావు

భువనగిరి టౌన్ : సురక్షిత ప్రయాణం కోసం వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రాచకొండ కమిషనరేట్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ దివ్యచరణ్‌రావు అన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై ముద్రించిన అవగాహన పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వాహనదారుల క్షేమం కోసమే ట్రాఫిక్ నిబంధనలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

భువనగిరి రూరల్ : విద్యార్థులు క్రమశిక్షణ పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని భువనగిరి ఎక్సైజ్ సీఐ బి.నాగిరెడ్డి అన్నారు. పట్టణంలోని పద్మావతి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఎలాంటి మత్తు పదార్థాలకు బానిస కాకుండా క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వెంకట్రావ్, చైర్మన్ శ్రీధర్‌గౌడ్, డైరెక్టర్లు ఉన్నారు.

గ్యాస్ సమాచారం

సరఫరా తేదీ : 31-8-2017

గ్యాస్ కంపెనీ బుకింగ్ తేదీ
ఇండేన్ ఆగస్టు28 బుక్ చేసుకున్న వారికి సరఫరా.. ఆన్‌లైన్ బుకింగ్ 9848824365, 08685-245553.

కూరగాయల ధరలు

దోసకాయ కిలోకు 16, సొరకాయ14, టమాట36, చిక్కుడు36, క్యాప్సికం28, గోకరకాయ22, మిర్చి (లావు)28, మిర్చి (సన్న)24, క్యారెట్38, క్యాబేజీ10, బీన్నీస్34, బెండకాయ20, దొండకాయ18, పొట్లకాయ18, చామగడ్డ28, కాకరకాయ24, బీరకాయ24, ఆలుగడ్డ16, ఉల్లిగడ్డ35, కీర18, ఉల్లిపొరక14, వంకాయ26.

(భువనగిరి రూరల్)

సినిమాలు

భువనగిరి
ఓంకార్- నక్షత్రం
వసుంధర- ఫిదా
భద్రాద్రి - దర్శకుడు
కేజేఆర్- గౌతమ్‌నంద

పోరుబాటలో నార్మాక్స్

● విజయ డెయిరీ లీటర్ పాలకు రూ.4 పెంపు ● నార్మాక్స్‌కు వర్తింపజేయని సర్కార్ ● నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

వ్యవసాయానికి ప్రత్యామ్నాయ జీవనోపాధి అయిన పాడి రైతులకు ప్రభుత్వమందిస్తున్న రాయితీపై వివక్షను వీడాలని జిల్లాలోని పాడి రైతులు ఆందోళనబాట పడుతున్నారు. జిల్లాలో అత్యల్ప సంఖ్యలో గల విజయ డెయిరీ లీటరు పాలకు రూ.4 రాయితీని అత్యధిక సంఖ్యలో గల నార్మాక్స్ రైతులకు వర్తింపజేయకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్న పాడిరైతులు ప్రభుత్వంపై ఒత్తిడికి సిద్ధమవుతున్నారు. జిల్లా పరిధిలోని 16మండలాల పాడి రైతులతో పాల సొసైటీ చైర్మెన్లు సమావేశమై సిద్ధం చేసిన కార్యాచరణ మేరకు గురువారం పెద్ద ఎత్తున ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నారు.

- ఆంధ్రజ్యోతి- యాదాద్రి

రాష్ట్రంలోనే మన జిల్లా అత్యధిక పాల ఉత్పత్తిని సాధించే జిల్లా. జిల్లా పరిధిలోని పాడి రైతులు తమ ఉత్పత్తుల విక్రయాల కోసం 1984లో ఉమ్మడి నల్లగొండ- రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల పరస్పర యూనియన్(నార్మాక్స్)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. హయత్‌నగర్ కేంద్రంగా హైదరాబాద్ జంట నగరాల్లో పాలు, పాల పదార్థాల మార్కెటింగ్‌ను మదర్ డెయిరీ పేరుతో కొనసాగిస్తోంది. అయితే ఈ రెండు ఉమ్మడి జిల్లాల పేరుతో కొనసాగుతున్న నార్మాక్స్‌లో 600సంఘాలు ఉన్నా ప్రస్తుత జిల్లాలోని 16మండలాల పరిధిలోనే 270 పాల సంఘాలు, దాదాపు 30వేలకు పైగా పాడి రైతులు ఉన్నారు.

రాయితీ దక్కని నార్మాక్స్ పాడి రైతులు

పాల ఉత్పత్తిని పెంచడంతో పాటు, పాడి రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం లీటర్ పాలకు రూ.4 రాయితీని ప్రకటించింది. అయితే ఈ రాయితీని రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ సంస్థ పరిధిలోని విజయ డైరీ సొసైటీ పరిధిలోని రైతులకే వర్తింప చేస్తోంది. నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో నార్మాక్స్ మాత్రమే కార్యకలాపాలు నిర్వహించడంతో ఈ ప్రాంతం లో పూర్తిగా నార్మాక్స్ యూనియన్ పరిధిలోనే పాడి రైతులు ఉన్నారు. రాష్ట్ర విభజనకు ముందు మాత్రమే కొన్ని గ్రామాల్లోనే విజయ డెయిరీ తమ సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. దీంతో ప్రభుత్వం ప్రకటించిన లీటర్‌కు రూ.4రాయితీ కేవలం జిల్లాలో కొద్దిసంఖ్యలో గల విజయ డెయిరీ సేకరణ కేంద్రాల రైతులకు అందుతోంది. మెజార్టీగా వేల సంఖ్యలోగల నార్మాక్స్ రైతులకు దక్కకుండా పోతోంది. అయితే ఒకే రాష్ట్రం, ఒకే జిల్లాలో పాడి రైతులకు ప్రభుత్వ రాయితీ ఒక డెయిరీ రైతులకు అందిస్తూ.. సహకార రంగంలోనే గల మరో డెయిరీ రైతులకు వర్తింపజేయకపోవడంపై కొంతకాలంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ విషయంపై జిల్లాలోని గ్రామ స్థాయి పాల రైతు సంఘాల నుంచి మొదలు నార్మాక్స్ పాలకవర్గం వరకు సీఎం కేసీఆర్‌కు, అప్పటి పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి గుట్ట లక్ష్మీనరసింహుడిని సందర్శించినపుడు జిల్లాలో విజయ డెయిరీ రైతులకు అందిస్తున్న రాయితీ లీటరుకు రూ.4 అందిస్తానని హామీనిచ్చారు. అయితే రాయితీ అమల్లోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా నార్మాక్స్ రైతులకు వర్తింపజేయలేదు. అసలే పాడి పశువుల సంరక్షణ వ్యయం పెరిగి.. పాల ఉత్పత్తి దిగుబడి కాని పరిస్థితుల్లో ప్రభుత్వ రాయితీ తమకు సైతం వర్తింపజేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు గురువారం జిల్లాకేంద్రంలో పాడి రైతులతో భారీ ప్రదర్శన, కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని పాల సంఘాల యూనియన్ ప్రతినిధి ననబోలు శ్రీనివాస్ రెడ్డి, నార్మాక్స్ మాజీ డైరెక్టర్ కాయితి వెంకట రెడ్డి తెలిపారు.

నార్మాక్స్ రైతులకు రాయితీ అందించాలి

● మంత్రి తలసాని, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మను కలిసిన నార్మాక్స్ పాలకవర్గం



తలసానికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

యాదాద్రి, ఆంధ్రజ్యోతి : పాడి రైతులను ఆదుకోవడానికి సీఎం కేసీఆర్ అందిస్తున్న లీటర్ పాలకు రూ.4 రాయితీని నార్మాక్స్ రైతులకు వర్తింపజేయాలని కోరుతూ నార్మాక్స్ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి, పాలకవర్గం బుధవారం పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మను వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందించారు. నార్మాక్స్ పరిధిలో 55వేల మంది పాడి రైతులు నాణ్యమైన పాలను ఉత్పత్తి చేస్తున్నారని వివరించారు. జిల్లాలో ఇటీవల కాలంలో ఏర్పాటు చేసిన విజయ డెయిరీ పాలకు ప్రభుత్వం అదనంగా రూ.4 వర్తింపజేసి, వేలాది మంది గల నార్మాక్స్ రైతులను విస్మరించిందని పేర్కొన్నారు. లాభాపేక్ష లేకుండా పాడి రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న నార్మాక్స్‌కు పోటీగా విజయ డెయిరీ కార్యకలాపాలు నిలిపివేయాలని, నార్మాక్ పాడి రైతులకు లీటరుకు రూ.4 రాయితీని అందించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి తలసాని శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ సీఎం కేసీఆర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకుపోయి నార్మాక్స్ రైతులకు రాయితీ వర్తింపజేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్టుగా తెలిపారు. వినతిపత్రాలు అందించిన వారిలో నార్మాక్ పాలకవర్గ సభ్యులు లింగాల శ్రీకర్‌రెడ్డి, కల్లెపల్లి శ్రీశైలం, సీహెచ్.వెంకట్రాంరెడ్డి, ఒగ్గు భిక్షపతి, కృష్ణారెడ్డి, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి, జలంధర్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జయశ్రీ, సురేందర్‌రెడ్డి, పూలమ్మ పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి : టీఎన్జీవో



ర్యాలీ తీస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

భువనగిరి రూరల్ : కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని టీఎన్జీవో రాష్ట్ర సహ అధ్యక్షుడు మందడి ఉపేందర్ రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రహదారి బంగ్లా నుంచి ర్యాలీ తీసి వినాయక చౌరస్తా రాస్తారోకో చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ 2004 సెప్టెంబర్1 తర్వాత నియామకమైన లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులకు నష్టం వాటిల్లే సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పెన్షన్ ఉద్యోగుల ప్రాథమిక హక్కు అని దీనిని హరించే హక్కు ప్రభుత్వాలకు లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సి.జగన్నాథ ప్రసాద్, టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సహదేవ్, టీజీవో జిల్లా అధ్యక్షుడు పీసీ వెంకటేశ్వర్లు, ఖాదీర్, వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ కె.వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు బి.భగత్, రాంమోహన్, కె.మోహన్‌రెడ్డి, నల్ల కృష్ణ, డేవిడ్, అశోక్, చందూలాల్, కలీమొద్దీన్ అంజన్‌కుమార్, శంకర్‌నాయక్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

దొరల పాలన కోసమే భూసర్వే : భిక్షమయ్యగౌడ్



విలేకరులతో మాట్లాడుతున్న భిక్షమయ్యగౌడ్

మోటకొండూర్ : దొరల పాలన కోసమే కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో భూసర్వే చేపడుతుందని ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బూడిద భిక్షమయ్యగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన పార్టీ మండల స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రైతు సమన్వయ కమిటీల పేరిట టీఆర్ఎస్ నాయకులకు నామినేట్ చేస్తూ రైతాంగ వ్యవస్థను నాశనం చేసే కుట్రను ప్రభుత్వం చేస్తోందన్నారు. భూసర్వేను రెవెన్యూ అధికారులతో చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమైక్య రాష్ట్రంలో కన్నా పోరాడి సాధించుకున్న తెలంగాణలో నిర్బంధాలు ఎక్కువయ్యాయని దీనికి కోదండరాం ఉదంతం నిదర్శనమని పేర్కొన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాల జాతర పేరిట ఉబ్బిస్తూ నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటోందన్నారు. వంగపల్లి నుంచి మోటకొండూర్‌కు వచ్చే జాతీయ రహదారిపై అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని పాదయాత్ర చేశామని ఇప్పటికీ స్పందించకుంటే పార్టీ తరపున ఆందోళన చేపడుతామన్నారు. ప్రభుత్వం చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోతుందని మద్దతు ధర లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన భూమండ్ల లింగస్వామి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యువకులు బూడిద భిక్షమయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం మండల కేంద్రంలో పంచభూత సేవాసమితి ఆధ్వర్యంలో నెలకొల్పిన గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గంగపురం మల్లేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మదార్‌గౌడ్, ఎంబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సుబ్రమణ్యం, యాదగిరిగుట్ట, మోటకొండూర్ మండల అధ్యక్షులు బీర్ల అయిలయ్య, మల్లేష్ యాదవ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అంబాల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ బాల్‌రాజ్‌గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు రేగు చంద్రశేఖర్, భూమండ్ల మల్లేష్, జహంగీర్, పాండు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, ఉప్పల నాగచంద్ర, జంపాల నాగచంద్ర, మంజూర్‌ఖాన్ పాల్గొన్నారు.

మినీ లోకం





జానపద నృత్యం చేస్తున్న చిన్నారులు

అలరించిన జానపద నృత్యాలు

భువనగిరి రూరల్ : విద్యా పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ స్కూల్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి జానపద నృత్య పోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.రోహిణి మాట్లాడుతూ విద్యలో భాగంగా సంస్కృతిక కార్యక్రమాలు కూడా విద్యార్థులకు అవసరమన్నారు. దీంతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత నైపణ్యాలు వెలికి తీసేందుకు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ నోడల్ ఆఫీసర్ ఎ.దశరథ రెడ్డి, ఏఎంవో రఘురాంరెడ్డి, ఏసీవో రంగ రాజన్, డీఎస్‌వో రాజశేఖర్, కరస్పాండెంట్ దిడ్డి బాలాజీ, ఎస్ఆర్‌జి పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నైపుణ్యం కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.



పైపులైన్‌ను పరిశీలిస్తున్న నాయకులు

మిషన్ భగీరథను సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరి రూరల్ : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న మంచి నీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ జడల అమరేందర్‌గౌడ్ అన్నారు. మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న పైపులైన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. గ్రామంలో తీవ్ర మంచి నీటి ఎద్దడి నెలకొన్న తరుణంలో మిషన్ భగీరథ నీరు గ్రామస్థులకు ఉపశమనం కలిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాటర్‌గ్రిడ్ డీఈ లక్ష్మణ్, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బారు బీరు మల్లయ్య, సర్పంచ్ కొండా స్వామి, ఎంపీటీసీ జక్కుల స్వామి, గ్రామస్థులు గౌటి సతీష్, రాంపల్లి చంద్రం, బబ్బూరి కృష్ణ, రాములు తదితరులు పాల్గొన్నారు.



బీ ఎస్.నిల్ సేవలు

- వేధిస్తున్న నెట్‌వర్క్ టవర్ల సమస్య
- తగ్గుతున్న వినియోగదారులు, ఇతర కంపెనీల వైపు మొగ్గు
- పలు కార్యాలయాల్లో స్థంభిస్తున్న సేవలు
- హోం మంత్రి స్వగ్రామంలో ప్రారంభానికి నోచని టవర్

నల్లగొండ అర్బన్: ఒకప్పుడు సమాచార రంగంలో ఓవెలుగు వెలిగిన బీఎస్ఎన్ఎల్ సేవలు ప్రస్తుత సమాచార వ్యవస్థలో చోటు చేసుకుంటున్న పోటీని తట్టుకోలేక పోతున్నాయి. వినియోగదారులకు ఆకర్షణీయమైన ఆఫర్లు ప్రవేశపెడుతూ ప్రైవేట్ కంపెనీల ధాటికి తట్టుకోలేకపోతుంది. టెలికామ్ వ్యవస్థలో వినియోగదారులను ఆకర్షించటంతోపాటు విస్తృతమైన నెట్‌వర్క్ కలిగి ఉండటం ప్రధానాంశాలుగా చెప్పవచ్చు. బీఎస్ఎన్ఎల్ సంస్థ ఈ రెండు అంశాల్లో రోజు రోజుకూ వెనుకబడి పోతోంది. ప్రైవేట్ కంపెనీల ధాటికి తట్టుకోలేక పోతోంది. వినియోగదారులను ఆకర్షించేందుకు ఇతర నెట్‌వర్క్‌ల కంపెనీలు అనేక రకాల ఆఫర్లు ప్రవేశ పెట్టడంతోపాటు తమ నెట్‌వర్క్‌ల సేవలను కూడా అంతటా లభించేలా ఏర్పాట్లు చేస్తున్నాయి. బీఎస్ఎన్ఎల్ సంస్థ ప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతుండటంతో నిబంధనల మేరకే పనిచేయాల్సి ఉంటుంది. కాబట్టి ప్రైవేట్ కంపెనీల పోటీని తట్టుకోలేక పోతుందని కమ్యూనికేషన్ రంగ నిపుణులు చెబుతున్నారు. జిల్లాలో బీఎస్ఎన్ఎల్ సేవలు రోజు రోజుకూ తగ్గిపోతున్నాయి. అందుకు ప్రధాన కారణాలు నెట్‌వర్క్ సమస్య, సెల్ టవర్ల సమస్య వేధిస్తుండటంతో వినియోగదారులు తగ్గిపోతున్నారు. జిల్లాలో ప్రధాన పట్టణాల్లో తప్ప మిగతా ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సేవలు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి.

వేధిస్తోన్న టవర్ల కొరత

టెలీ కమ్యూనికేషన్ల వ్యవస్థకు వెన్నెముకగా ఉండే సెల్ టవర్ల కొరత బీఎస్ఎన్ఎల్‌ను వేధిస్తోంది. ఇతర ప్రైవేట్ కంపెనీలతో పోల్చుకుంటే టవర్ల సంఖ్య చాలా తక్కువగా ఉంది. సెల్‌టవర్ల కొరతతో వినియోగదారులకు సరైన నెట్‌వర్క్ అందించలేకపోతున్నారు. నెట్‌వర్క్ ఉన్న చోట వినియోగదారులు అధికంగా ఉండటంతో ఒక్కోసారి సర్వర్ సేవలు మందగించటంతోపాటు నిలిచిపోతున్నాయి. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటుండటమేగాకుండా ఇతర కంపెనీల నెట్‌వర్క్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి జిల్లా విస్తీర్ణం ప్రకారం 500వరకు టవర్లు ఉండాల్సి ఉంది. ఇన్ని టవర్లు ఉంటేనే నలుమూలలా నెట్‌వర్క్ అందుబాటులో ఉంటుంది. కానీ ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ టవర్ల సంఖ్య అందులో సగం కూడా లేదంటే అతిశయోక్తికాదు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 233 టవర్లు మాత్రమే ఉన్నాయి. అందులో కొన్ని మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్నాయి. మరో 81 టవర్లు కొత్తవి రానున్నాయి. ఒక్కో టవర్ నెట్‌వర్క్ పరిధి ఒక్కో విధంగా ఉంటుంది. ల్యాండ్‌లైన్ టవర్ పరిధి ఎటూ 4కి.మీ. పరిధి వరకు అందుతుంది. సెల్‌ఫోన్ టవర్ అయితే 8కి.మీ. దూరం పరిధి వరకు నెట్‌వర్క్ అందుతుంది. బీఎస్ఎన్ఎల్ టవర్ల ఏర్పాటులో కూడా అంతరాయాలు, అభ్యంతరాలు ఎదురవుతుండటంతో కొన్నిచోట్ల సేవలు అందించలేకపోతున్నారు. మరికొన్ని చోట్ల టవర్లు మరమ్మతులకు గురైనా పట్టించుకున్న నాథుడే లేడు. కొన్ని టవర్ల వద్ద నిర్వహణా వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా తయారైంది. సెక్యూరిటీ లేకపోవటంతో బ్యాటరీలు తస్కరణకు గురవుతున్నాయి. సంస్థలో సిబ్బంది కొరత కూడా వేధిస్తుంది. రేడియేషన్‌ను దృష్టిలో పెట్టుకుని గ్రామాలకు రెండు మూడు కి.మీ.ల దూరంలో టవర్లు వేయటంతో కొన్ని చోట్ల నెట్‌వర్క్ అందటంలేదు. మరికొన్ని చోట్ల రోడ్డు వెడల్పు, మిషన్‌భగీరథ పనులవల్ల కేబుళ్లను తొలగిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

తగ్గుతున్న వినియోగదారులు

బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు రోజు రోజుకూ తగ్గుతున్నారు. అందుకు ప్రధాన కారణం నెట్‌వర్క్ సమస్య ఒకటైతే వినియోగదారులకిచ్చే ఆఫర్లు మరో సమస్య. మూడు జిల్లాల పరిధిలో ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సంఖ్య ఈ విధంగా ఉంది. ల్యాండ్‌లైన్ కనెక్షన్లు 16,388, మొబైల్ కనెక్షన్లు 2,14,230, బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు 6,920 ఉన్నాయి. జిల్లాలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య నెట్‌వర్క్. గ్రామాల్లో మారుమూల ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సేవలు అందుబాటులో లేవు. కేవలం ప్రధాన పట్టణాల్లో మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

స్థంభిస్తున్న పలు ప్రభుత్వ సేవలు

బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ కలిగి ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సర్వర్ అంతరాయంవల్ల, నెట్‌వర్క్ సరిగా అందకపోవటం వల్ల సేవలు స్థంభించి పోతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా ప్రభుత్వరంగ సంస్థల్లో చాలా మేరకు బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌నే కలిగి ఉన్నాయి. బ్యాంకులతోపాటు ప్రభుత్వం ప్రజారోగ్యం కోసం మందులను పారదర్శకంగా సరఫరా చేసేందుకు ఈ-ఔషధిని ప్రవేశపెట్టింది. అన్ని ప్రాథమిక ఈ-ఔషధి నిర్వహణకు బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌నే ఉపయోగిస్తున్నారు. గత వారం రోజులనుంచి నెట్ వర్క్ ప్రాబ్లమ్‌వల్ల ఈ-ఔషధి నెట్‌వర్క్ కాస్తా కుంటుపడింది. దీంతో ఆస్పత్రులకు మందుల సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అంతేగాకుండా గర్భిణుల నమోదుకు కూడా 'ఆన్‌లైన్' విధానాన్నే అనుసరిస్తున్నారు. చాలా చోట్ల బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ అందుబాటులో లేకపోవటంతో నమోదు చేయటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మీ-సేవా కేంద్రాల్లో కూడా నెట్‌వర్క్ అంతరాయాలు ఏర్పడటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

హోంమంత్రి సొంతూరులో..

బీఎస్ఎన్ఎల్ సేవలు ఎంతో నిర్లక్ష్యంగా ఉన్నాయనటానికి నిదర్శనం హోం మంత్రి నాయిని నరసింహా రెడ్డి సొంతూరు నేరేడుగొమ్ము మండలమేనని చెప్పవచ్చు. నూతనంగా ఏర్పడిన ఈ మండల కేంద్రంలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మించి దాదాపు రెండు సంవత్సరాలు గడిచింది. కానీ నేటివరకు టవర్ ఉపయోగంలోకి రాలేదు. అదే విధంగా సాగర్‌లోనూ బీఎస్ఎన్ఎల్ సేవలు నిలిచిపోవడంతో ప్రభుత్వ కార్యక్రమాలకు ఆటంకం కలిగింది.

టవర్ల సమస్యే ప్రధాన కారణం

ఉమ్మడి జిల్లా పరిధిలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ టవర్ల సమస్యే ప్రధాన కారణం. తెలంగాణాలో అతి తక్కువ టవర్లున్నది ఉమ్మడి నల్లగొండ జిల్లా మాత్రమే. నూతనంగా మరో 81 టవర్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఏర్పాటు చేస్తే కొంతమేర నెట్‌వర్క్ సమస్యను అధిగమిస్తాం. కొన్నిచోట్ల రోడ్డు వెడల్పు పనులు చేపడుతుండటంతో కేబుల్ వ్యవస్థ దెబ్బతిని సంబంధాలు తెగిపోయి వినియోగదారులు ఇబ్బందులెదుర్కొంటున్న మాట వాస్తవమే.

శ్రీనివాసమూర్తి డీజీఎం

జనవరి నుంచి ప్రతిఇంటికీ నీరు

- కలెక్టర్ల సమావేశంలో
- విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

కలెక్టరేట్, సూర్యాపేట: వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీనుంచి మూడుజిల్లాల పరిధిలో ప్రతిఇంటికి మిషన్ భగీరథ పథకం ద్వారా నల్లాల ద్వారా మంచి నీటిని సరఫరా చేయనున్నట్లు విద్యుత్, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి స్పష్టంచేశారు. బుధవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి- భువనగిరి జిల్లాల కలెక్టర్లు కడవేరు సురేంద్రమోహన్, గౌరవ్‌ఉప్పల్, అనితారామచంద్రన్‌తోపాటు ఆయా జిల్లాల జేసీలు, మిషన్‌భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మిషన్‌భగీరథ పనుల ప్రగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లా, మండలకేంద్రాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నందున భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌లను కొత్తగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిర్దేశించిన సమయంలోపు పనులను పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయి ఉద్యోగులు కృషి చేయాలన్నారు. పనుల పురోగతిపై ప్రతిరోజు అధికారులు మానిటరింగ్ చేసి నివేదిక ఇవ్వాలని సూచించారు. జిల్లాలో సీజ్‌చేసిన ఇసుకను మిషన్‌భగీరథ, ఇంట్రావిలేజ్ పైపులైన్ నిర్మాణ పనులకు కేటాయించాలన్నారు. రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణం జరుగుతున్న ప్రాంతాలకు మిషన్ భగీరథ నీరు అందే విధంగా పనులు చేయాలన్నారు. 10 ఇళ్లు ఉన్న ఆవాసాలకు కూడా నీరు సరఫరా చేయాలని ఆదేశించారు. అందుకోసం సమీపంలో ఉన్న గ్రామాల ట్యాంక్‌లనుంచి పైపులైన్లను పొడిగించాలన్నారు. ఒకవేళ ఆవాసాలు దూరంగా ఉన్నట్లయితే ప్రత్యామ్నాయంగా చిన్న ట్యాంక్‌లను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. 2040 నాటికి పెరిగే పట్టణ కాలనీలను పరిగణనలోనికి తీసుకొని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పులిచింతల ముంపు పునరావాస కాలనీలకు కూడా మిషన్ భగీరథ నీటిని అందించాలన్నారు.

అరక పట్టిన రైతులకే రైతు సమాఖ్యలో ప్రాతినిధ్యం

